## క్లుప్తంగా

### పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేతను కలిసిన నూకతోటి రాజేష్

నాగలాపురం : వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ సురేష్ కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ బుధవారం ఊత్తుకోట్టైలోని సురేష్ ఇంటికి చేరుకుని పరామర్శించారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సీనియర్ నాయకులు బీరేంద్ర వర్మ, భాను ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

**సత్యవేడులో..**

సత్యవేడు : పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాణిక్యంను నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీరేంద్రవర్మ, సుశీల్‌కుమార్‌రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, మస్తానమ్మ, గోవిందస్వామి, ఎంపీటీసీ సురేంద్ర, రవి, టెంకాయల కృష్ణయ్య, పళణి, జోషఫ్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

### రేపు పెన్షనర్ల దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలోని పెన్షనర్స్ భవనంలో శుక్రవారం పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకయ్య తెలిపారు.

### ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సినీ సంగీత దర్శకుడు కోటి

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం సినీ సంగీత దర్శకుడు కోటి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ వేర్వేరుగా దర్శించుకున్నారు.

### మూడేళ్లకు ఒకసారి వేలంపాట నిర్వహించాలి

నాగలాపురం : మేజర్ పంచాయతీ దుకాణ సముదాయంలోని గదులకు ప్రస్తుతం ఏటా వేలం పాట నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు ఉన్నాయని దుకాణాదారులు విన్నవించారు. ఏటా అద్దె పెంచడం వల్ల చెల్లించలేని పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై బజారు వీధిలోని షాపింగ్ గదులను మూడేళ్లకు ఒకసారి వేలం పాట నిర్వహించాలని, అద్దెలు తగ్గించాలని దుకాణాదారులు పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వినతి పత్రం సమర్పించారు.

### ఆటిజంపై అవగాహన




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ : పుట్టుకతోనే పిల్లల్లో వచ్చే అరుదైన వ్యాధి ఆటిజం అని మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని భవిత కేంద్రంలో జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాల్లో పిల్లల్లో ఆటిజం పెరుగుతోందన్నారు. ఆటిజం సోకిన పిల్లలకు చికిత్సతో పాటు బిహేవియర్ థెరపీ, స్పీచ్ థెరపీ అందిస్తూ సాధారణ స్థితికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి, ఫిజియోథెరపిస్టు విజయ్‌కుమార్, భవిత స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పన్ను వసూళ్లలో శ్రీకాళహస్తికి 79వ ర్యాంకు

శ్రీకాళహస్తి: ఆస్తి పన్ను వసూళ్లలో శ్రీకాళహస్తి రాష్ట్ర వ్యాప్తంగా 79వ ర్యాంకు సాధించింది. పట్టణంలో సుమారు 20 వేల మంది పన్ను వసూలు దారులు ఉన్నారు. ఏడాదికి రూ.9.23 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీకి రూ.6.44 కోట్లు వసూలు చేశారు.

### సేవలకు సత్కారం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న విష్ణువర్ధని పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదకర ప్రయాణం

- నిత్యం వందల ఆటోల్లో పరిశ్రమలకు తరలింపు
- కార్మికుల భద్రత గాల్లో దీపం
- పట్టించుకోని అధికారులు



పాఠశాల విద్యార్థులతో ప్రయాణం ఇలా..

వరదయ్యపాళెం: సత్యవేడు–వరదయ్యపాళెం ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో రోజువారీగా పరిశ్రమలకు వెళ్లే కార్మికులను ఆటోల్లో తరలిస్తున్నారు. అయితే ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భద్రతను గాలికొదిలేస్తున్నారు. మితిమీరిన వేగంతో పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుని ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా ఆటో డ్రైవర్లు భద్రత ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన రవాణా, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైన అనుకోని ఘటన జరగక ముందే వీరు మేల్కోవాల్సిన అవసరం ఉంది.

**ఎందుకీ నిర్లక్ష్యం**

కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకొస్తారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల కష్టంతో ఆ పరిశ్రమ అభివృద్ధి దిశలో పయనిస్తుంది. అంతటి కీలకంగా వ్యవహరించే కార్మికుల భద్రత గురించి పరిశ్రమల యాజమాన్యాలు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలకు కార్మికులను తరలించేందుకు భద్రత ప్రమాణాలతో కూడిన బస్సులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యమెందుకని ప్రశ్నిస్తున్నారు. కేవలం భద్రత ప్రమాణాలు లేని ఆటోలు, ఇతర వాహనాల్లో కార్మికులను తరలించడం ఏమిటని నిలదీస్తున్నారు. పరిశ్రమ వృద్ధిలో కీలకంగా వ్యవహరించే కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం చేయొద్దని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.



శ్రీసిటీ పరిశ్రమలకు ఆటోలో తరలి వెళ్తున్న మహిళా కార్మికులు

**ప్రమాదమని తెలిసినా..**

ప్రధానంగా అటు శ్రీసిటీ పరిశ్రమలకు ఇటు చిన్న పాండూరు సమీపంలోని ఏపీఐఐసీ పరిధిలో ఏర్పాటైన పరిశ్రమలకు, తడ సమీపంలోని అపాచీ, ఇతర పరిశ్రమలకు వరదయ్యపాళెం, సత్యవేడు, చిన్న పాండూరు ప్రాంతాల నుంచి వందల ఆటోల ద్వారా కార్మికులు రోజువారీ విధులకు వెళ్తుంటారు. అయితే ఆటోలలో వెనుక భాగంలో సైతం మహిళా కార్మికులు ప్రయాణిస్తుంటారు. ఆటో వెనుక భాగంలో కాళ్లు వేలాడదీసుకుని మరీ భద్రతా ప్రమాణాలను ఏ మాత్రం లెక్క చేయకుండా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకొంటున్నారు. అంతేకాక అతివేగంగా రోడ్లపై హల్‌చల్ చేస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో జరగరానిది జరిగితే వారిని నమ్ముకున్న కుటుంబాలకు ఎవరూ భరోసా ఇస్తారో తెలియని పరిస్థితి. ఆటోలలో వెళ్లే ప్రతి కార్మికుడు, కార్మికురాలు కుటుంబ పోషణ నిమిత్తం వ్యయ ప్రయాసలకు ఓర్చి రోజువారీ కూలీలుగాను, నెలసరి ఉద్యోగులుగా కుటుంబ పోషణ కోసం వెళ్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో వారి భద్రత గురించి అటు పరిశ్రమలు గానీ, ఇటు ప్రభుత్వ యంత్రాంగం గానీ ఆలోచన చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



చిన్న పాండూరు ఏపీఐఐసీ పరిధిలోని పరిశ్రమలకు ఆటోలో తరలి వెళ్తున్న కార్మికులు

## పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వసంతబాయి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుధవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ వసంతబాయి రాచగున్నేరి గ్రామ పంచాయతీ, ఊరందరు రోడ్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, ఎత్తు, బరువులు చూసి పోషణ స్థితిని గుర్తించారు. పోషకాహారంతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. తల్లిదండ్రులతో సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిల్డ్రన్ హోమ్ బాలసదన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వాసంతి, సీడీపీఓ శాంతి దుర్గ, సూపర్‌వైజర్ , సర్పంచు రాజు గునేరి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణ?

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం సమీపంలో పాల కేంద్రం వద్ద ప్రభుత్వ భూమిలో కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 115 సర్వే నంబర్‌లోని స్థలం కొత్తగా ఏర్పాటవుతున్న ఆరు లైన్ల రహదారికి దగ్గరగా ఉండడంతో ఇక్కడ భూములకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కళ్లు ఈ భూముల మీద పడ్డాయి. అయితే ఈ స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా ఏ విధమైన దస్తావేజులు లేకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు ఏమీ ఎరుగనట్లు ఉండడం చాలా బాధ కలిగిస్తోందని సీపీఐ నాయకులు గోపి ఆరోపించారు.

## పింఛన్ సొమ్ము స్వాహా ప్రభుత్వ వైఫల్యమే!



మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

సత్యవేడు : మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ పింఛన్ సొమ్ముతో పరారీ కావడం ప్రభుత్వ వైఫల్యమేనని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. రెండు రోజుల కిందట కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ 63 మందికి చెందిన పింఛన్ సొమ్ము రూ.2.60 లక్షలు పంపిణీ చేయకుండా పరారీ కావడంపై నూకతోటి రాజేష్ స్పందిస్తూ విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన వాలంటీర్ల వ్యవస్థ కూటమి ప్రభుత్వం కొనసాగించి ఉంటే ఇలా జరిగేది కాదన్నారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికంగా గ్రామాల్లో ఉంటున్న వాలంటీర్లు 50 ఇళ్లకు వెళ్లి వృద్ధులకు పింఛన్ సక్రమంగా పంపిణీ చేసేవారన్నారు. నాలుగేళ్లలో మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని, ప్రజల భయపడవద్దని, మళ్లీ వాలంటీర్ వ్యవస్థను తీసుకొస్తారన్నారు.

## జోరుగా పంట నూర్పిళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు, కనమనంబేడు, వెస్టువరత్తూరు, కారణి గ్రామాల్లో మినుము పంట నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో 210 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. పంట దశ పూర్తి కావడంతో నూర్పిళ్లల్లో రైతులు బిజీగా గడుపుతున్నారు. వాణిజ్య పంట కావడంతో మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ.20 వేలు మిగులుతోందని, ప్రస్తుతం ధర తక్కువగా ఉండటంతో ఆదాయం తగ్గిందని రైతులు చెబుతున్నారు. మెట్ట భూముల్లో రైతులు మినుము పంటను అధికంగా సాగు చేస్తున్నారు.

## అసంపూర్తి పనులతో అవస్థ



అసంపూర్తిగా శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని 14 గ్రామ సచివాలయాల వద్ద రూ. 42 లక్షలతో నిర్మిస్తున్న సెక్రటేరియట్ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో సచివాలయ సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు వాష్ రూంకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సచివాలయం వద్ద రూ. 3 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ను నిర్మించడానికి గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి నిర్మాణ పనులు పూర్తి కాకుండానే వదిలేశారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి

బుచ్చినాయుడుకండ్రిగ : సీఐఎఫ్, బ్యాంక్ లోన్, స్త్రీనిధి, ఉన్నతితో పాటు ఇతర కార్పొరేషన్ రుణాలు, వ్యక్తిగత రుణాలను తీసుకున్న మహిళలు సకాలంలో రుణాలు చెల్లించాలని సప్తగిరి బ్యాంకు మేనేజరు వెంకట రమణ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం 2025–2026 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ.. మండలంలోని మహిళా సంఘం సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, ఫీల్డ్ ఆఫీసర్ శరత్ పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాల పంపిణీ



వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మండలంలో పలువురు రైతులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాయితీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. బుధవారం మదనంబేడు పంచాయతీలో వ్యవసాయ శాఖ ఏడీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ చంద్రశేఖర్ పార్టీ నాయకులతో కలిసి 14 మంది రైతులకు వ్యవసాయ పరికరాలు లెవలింగ్ బ్లేడ్లు, వీలర్స్, మడకలు, తైవాన్ స్ప్రేయర్లు అందజేశారు. అనంతరం దాసుకుప్పం, సత్యవేడులో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు రాజశేఖర్ , ఎస్‌ఐ రామస్వామి, మాజీ మండల అధ్యక్షుడు పరమశివం (బాషా), సుందరరామిరెడ్డి, లోకయ్య, ఎంఈఓ రవి, ఏఓ మురళి పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు అవగాహన అవసరం



పిల్లలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

సత్యవేడు : తల్లిదండ్రులు ఆటిజంపై అవగాహన కలిగి ఉండాలని ఐఈఆర్టీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని నరసరాజు అగ్రహారం భవిత సెంటర్‌లో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్టీ వెంకటరత్నం మాట్లాడుతూ.. ఆటిజం పిల్లలకు తల్లిదండ్రులే రక్షకులుగా మారాలని సూచించారు. అనంతరం ఐఈఆర్టీ–2 దివ్యకుమారి మాట్లాడుతూ.. ఆటిజం రకాలు, కారణాలు, లక్షణాలు , పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లి దండ్రులు మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా పిల్లలకు అండగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు రజనీ, ప్రత్యేక ప్రతిభావంతుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 12న త్రిమూర్తుల కల్యాణ మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతాప్ స్వామిజీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో ఏకవీర సేవా ఫౌండేషన్, సురభి గో సంరక్షణశాల ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన త్రిమూర్తుల కల్యాణ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామిజీ మాట్లాడుతూ.. చైత్ర పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం నిమిత్తం త్రిమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మహోత్సవంలో పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయ రెడ్డి, వన్నికుల క్షత్రియ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి, జగదీశ్వర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు దక్షిణామూర్తి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి



బస్సు కండీషన్‌ను చూస్తున్న ఎంవీఐ

శ్రీకాళహస్తి : ప్రైవేటు పాఠశాల బస్సు బ్యాటరీ సరిగా పనిచేయకపోవడంతో నడి రోడ్డులో ఆగినట్లు ఎంవీఐ దామోదరనాయుడు తెలిపారు. బుధవారం ప్రైవేటు పాఠశాల బస్సు నడి రోడ్డులో ఆగిందనే సమాచారంతో ఆయన పాఠశాలను సందర్శించి బస్సు కండీషన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బస్సులో బ్యాటరీ సరిగా పని చేయడం లేదని గుర్తించామన్నారు. బ్యాటరీ మార్చాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించామన్నారు. వాహనాన్ని ఆర్టీవో కార్యాలయానికి తరలించాలన్నారు. పిల్లలను నడిరోడ్డులో దింపకూడదని డ్రైవర్, సహాయకుడిని హెచ్చరించామన్నారు.

## పోలీసుల తనిఖీలు



తనిఖీలకు హాజరైన పోలీసులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బీట్లు, బ్లూకోట్స్, రక్షక్, హైవే మొబైల్ టీంలు దుకాణాలను మూయించే కార్యక్రమం చేపటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. దుకాణాలు సమయానికి మించి ఉంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణోత్సవం



అలంకరణలో ఉత్సవమూర్తులు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో భద్రావతీ సమేత భావనారుషి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉత్సవర్ల కల్యాణాన్ని బుధవారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. 11 గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించిన భద్రావతీ, భావనారుషిల కల్యాణోత్సవంలో పద్మశాలి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం పూజలు అనంతరం పులి వాహనంపై ఉత్సవమూర్తి అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. గురువారం సాయంత్రం చక్ర స్నానంతో ఉత్సవాలు పరి సమాప్తమవుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాలో ఊరేగింపు సందర్భంగా వినియోగించే గొడుగులను మునిదామోదరం, రేవతి దంపతులు ఆలయానికి బహూకరించారు.

## వంతెన పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి

వరదయ్యపాళెం : మండలంలోని సిద్ధాపురం వద్ద రాళ్లవాగుపై నూతనంగా నిర్మించనున్న వంతెన పనులు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఈఈ రామ్మోహన్, ఏఈ కుమార్ కలిసి ఎస్ఈ రాళ్లవాగు వద్ద నిర్మించనున్న వంతెన ప్రదేశాన్ని పరిశీలించారు. వంతెనకు సంబంధించి డిజైన్ వివరాలను తెలుసుకున్నారు. రూ.4 కోట్లతో నిర్మించనున్న వంతెనను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. సిద్ధాపురం – రేపల్లెవాడ హరిజనవాడకు వెళ్లే మార్గంలో వచ్చే వంతెన పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఆయన వెంట కాంట్రాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నారాయణవనం : ప్రత్యేక అవసరాలు గల పిల్లలు భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచించారు. బుధవారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్ఎం శ్రీచంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు విజయన్, భరత్ , సీఆర్పీలు పాల్గొన్నారు.

## ప్రత్యేక శిక్షణ అవసరం

శ్రీకాళహస్తి : పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం ఆటిజం అవగాహన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో బాలయ్య మాట్లాడుతూ.. ఆటిజం అనేది జన్యుపరమైన కారణాలతో సంభవిస్తుందన్నారు. ఆటిజం పిల్లలు ఎవరితోనూ కలవరన్నారు. శబ్దాలు గ్రహించలేకపోవడం, దెబ్బ తగిలినా గుర్తించకపోవడం వంటి లక్షణాలు ఉంటే ముందుగానే గుర్తించి పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతిరోజు ఆ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుకన్య, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల విలాపం

- పింఛన్ ధ్రువీకరణకు అగచాట్లు
- శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వద్ద పడిగాపులు

వరదయ్యపాళెం : అసలే మండుటెండలు.. రోజంతా ఆస్పత్రి వద్ద పడిగాపులు వెరసి విభిన్న ప్రతిభావంతులను రోజంతా ఆస్పత్రి వద్ద నిరీక్షించడంతో నీరసించిపోయారు. వారంతా పుట్టుకతో వైకల్యం బారినపడి విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌కు ఎంపికైనవారు. అలాంటి వారిని ప్రభుత్వం వెరిఫికేషన్ పేరుతో 2 నెలలుగా పలుచోట్లకు తిప్పుతోంది. తాజాగా బుధవారం సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 150 మంది విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌దారులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెరిఫికేషన్‌కు పిలిపించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఆస్పత్రికి చేరుకున్నా.. ఉదయం 11గంటలు దాటినా వెరిఫికేషన్ అధికారులు రాకపోవడంతో మండుటెండలకు తట్టుకోలేక ఉక్కపోత భరించలేక విలవిల్లాడారు. ఆలస్యంగా వచ్చిన అధికారులు మీ మండలాలకు సంబంధించి సచివాలయ సిబ్బంది ఉంటేనే విచారణ చేస్తామని ఆంక్షలు విధించడంపై ఒకింత ఆగ్రహానికి గురయ్యారు.



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న సత్యవేడు, వరదయ్యపాళెం విభిన్న ప్రతిభావంతులు



అలసిసొలసిన విభిన్న ప్రతిభావంతులు